క్లుప్తంగా

'మత్తు'తో జీవితం చిత్తు



మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార: జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ బర్ల ప్రసాదరావు అన్నారు. కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వినియోగం- నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం వ్యసనాల బారిన పడి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని హితవుపలికారు. నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకొని ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అప్పలరాము, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఓపెన్ హౌస్



ఓపెన్ హౌస్‌లో ఆయుధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాలు, విధులు, రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేష గిరి, అధికారులు వివరించారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్‌తో పాటు పలు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఓపెన్ హౌస్‌కు హాజరయ్యారు. సందేహాలు అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

శ్రీకాకుళం: ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలని ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ అన్నారు. 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నగరంలోని విశాఖ-బి కాలనీలో షిర్డీసాయి ఆలయంలో ఆయుర్వేదం-స్త్రీల ఆరోగ్యం అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం, ప్రజలు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్, గోవిందరాజులు, ట్రస్ట్ చైర్మన్ కె.మురళీధర్, శేఖర్, రామారావు, ఉషారాణి, వరలక్ష్మి, మురళీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార: సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం గార తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు, భూ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పు తదితర సమస్యలపై వినతులందాయి. దరఖాస్తులను సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, గుండ భాస్కరరావు, గొండు మూర్తి, బడగల వెంకటప్పారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కలకలం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో కొంతమంది గంజాయి మత్తుకు అలవాటుపడినట్లు ప్రచారం సాగుతోంది. ఎచ్చెర్ల, చిలకపాలెం ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి వీరు వినియోగిస్తున్నారని, పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి అనుమానితులను ప్రశ్నిస్తున్నారని గ్రామంలో చర్చ జరుగుతోంది. ఈ విషయమై ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఇదంతా ప్రచారం మాత్రమేనని, ఎటువంటి గంజాయి వినియోగదారులను గుర్తించలేదని స్పష్టం చేశారు.

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అనంతరం సుగంధ పరిమళ పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు.

అభివృద్ధి పనులకు రాజకీయ గ్రహణం

- ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ పనులకు లభించని పరిపాలనా ఆమోదం
- కూటమి నాయకుల ఒత్తిళ్లే కారణం!
- డిసెంబర్‌లోగా పూర్తి చేయకపోతే నిధులు వెనక్కే..
- న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు



ఎచ్చెర్ల జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

ఎచ్చెర్ల క్యాంపస్: పల్లె పండగ అంటూ అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వం .. పల్లెల ప్రగతిని అడ్డుకునే ప్రయత్నం చేయటం విమర్శలకు తావిస్తోంది. గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ పనులు ఎంతో కీలకం. ఇందులో 40 శాతం మెటీరియల్ కాగా మిగిలిన 60 శాతం వేతనదారులకు నిధుల రూపంలో మంజూరు చేస్తారు. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో సిమెంట్ రోడ్లు, కాలువలు వంటి నిర్మాణాలు చేపడతారు. తాజాగా కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరిట పనులు చేపడుతోంది. ఎచ్చెర్ల మండలంలో మాత్రం పనుల నిర్వహణకు అనుమతులు రాలేదు. ఈ పనులు మంజూరు కాకుండా అధికారులపై కూటమి నాయకులే ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ పనులను డిసెంబర్‌లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాధాన్యం ఇవ్వనందునేనా..

ఆగస్టు 23న జిల్లావ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించి ప్రతిపాదనలను మండలానికి పంపించారు. దీనిలో భాగంగా ఎచ్చెర్లలోనూ సెప్టెంబర్ 12న మండల పరిషత్ సమావేశంలో పనులకు ఆమోదం తెలిపారు. 148 పనులు గుర్తించగా, అంచనా విలువ రూ.12.38 కోట్లుగా పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో చాలా మండలాల్లో పనులకు ఆమోదం వచ్చినా ఎచ్చెర్ల మండలంలో గుర్తించిన పనులకు మాత్రం ఉన్నతాధికారుల నుంచి ఆమో దం లభించలేదు. ఎచ్చెర్ల మండలంలో గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు ఉండటం, మండల పరిషత్‌లో ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందిన వాళ్లు ఉండటంతో స్థానిక సంస్థల నిబంధనలు మేరకు గ్రామసభలు, మండల పరిషత్‌లో ఆమోదం లభించింది. ఈ క్రమంలో కూటమి నాయకులకు ఎచ్చెర్ల మండలంలో ప్రాధాన్యత దక్కకపోవడం వల్ల ఉన్నత స్థాయిలో పనులకు ఆమోదం లభించకుండా అడ్డు తగిలినట్లు సమాచారం. ఈ విషయమై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు న్యాయపరంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సమా చారం. మరోవైపు, పనులు సకాలంలో పూర్తి చేయకపోతే నిధులు వెనక్కు వెళ్లిపోయే అవకాశముంది.

చట్టాలను గౌరవించాలి..



పంచాయతీరాజ్ చట్టాలను కూటమి ప్రభుత్వం, అధికారులు గౌరవించాలి. గ్రామ పంచాయతీ గ్రామసభ తీర్మానం, ఇంజినీరింగ్ అంచనాలు, మండల పరిషత్ ఆమోదం పనుల్లో కీలకం. నిబంధనలు అతిక్రమించి పనులు ఆపటం, గ్రామాల ప్రగతి అడ్డుకోవటం మంచిది కాదు. పనులు మంజూరు కాకుండా పల్లె పండగ కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏంటి?

– స్వాతి, అల్లినగరం ఎంపీటీసీ సభ్యురాలు

న్యాయపోరాటం చేస్తాం



పంచాయతీరాజ్ నిబంధనల మేరకు ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులు జరగాలి. గ్రామాల ప్రగతిలో ఈ పనులే కీలకం. వీటిని అడ్డుకుంటున్నందుకు న్యాయపరంగా పోరాటం చేస్తాం. ఉన్నతాధికారులు లోపాలు ఉంటే సరిచేయాలి తప్ప పనులకు అనుమతులు ఇవ్వకపోవటం చట్టవిరుద్ధం.

– ఎం.జగదీశ్వరరావు, బొంతలకోడూరు ఎంపీటీసీ సభ్యుడు

కారణం తెలియదు

గ్రామసభల్లో ఎంపిక చేసిన పనులు ఇంజినీరింగ్ అధికారుల అంచనాలతో మండల పరిషత్ తీర్మానం తర్వాత అధికారులకు పంపించాం. అయితే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు. కారణమేంటో తెలియదు. మా వరకు నిబంధనలన్నీ అనుసరించాం.

– సీపాన హరిహరరావు, ఎంపీడీఓ, ఎచ్చెర్ల

మందుల సెంటర్‌లో మందు షాపు!

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోనే అత్యంత రద్దీ ప్రాంతం, మెడికల్ హబ్‌గా పేరుగాంచిన డేఅండ్ నైట్ వద్ద ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్న వ్యక్తి అనధికారికంగా మద్యాన్ని అమ్ముతుండటంతో పరిసర ప్రాంతాల వారు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడురోజులుగా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఫాస్ట్‌ఫుడ్ వంటకాలతో పాటు మద్యం బాటిళ్లను అమ్మకాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎక్సైజ్ సీఐ ఎం.వి.గోపాలకృష్ణ సిబ్బందితో శుక్రవారం రాత్రి షాపుపై దాడులు నిర్వహించగా ఎటువంటి మద్యం బాటిళ్లు దొరక్కపోవడంతో వెనుదిరిగారు. ముందస్తుగా ఎవరో సమాచారం ఇవ్వడంతోనే ఇలా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.



షాపును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, పశు సంవర్ధక శాఖ అధికారులు శుక్రవారం బంటుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి పశుసంవర్ధక సిబ్బంది వచ్చి గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు వంటి 16 రకాల పశువుల వివరాలను లెక్కిస్తారని తెలిపారు. ఈ నెల 25న ప్రారంభమైన ఈ సర్వే ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీఏ బి.దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిష్టప్పపేటలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పశుగణన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతదేశంలో పశువుల పెంపకం కీలక ఆర్థిక వనరని, జాతీయ ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.



రణస్థలం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: భూముల రీ సర్వేలో లోపాలు ఉంటే గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గాయిత్రి అన్నారు. శుక్రవారం జగన్నాథపురం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ వన్-బి రాకపోతే కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యకమంలో ఆర్ఐ రాధ, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, రాజు, వీఆర్ఓ దుర్గారావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ గాయిత్రి

ధ్యానంతో మానసిక ప్రశాంతత

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మారం శివప్రసాద్ అన్నారు. నగరంలోని నక్కవీధిలో ఆనంద పిరమిడ్ ధ్యాన కేంద్రం మూడో వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మజ్ఞాన సందేశం, సామూహిక ధ్యానం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం సభ్యులు బాలాజీ బిందుమాధవి, ధర్మారావు, అజిత్, సత్యనారాయణ పాల్గొన్నారు.



సాధకులకు సందేశమిస్తున్న శివప్రసాద్

ఫుట్‌పాత్ దుకాణాల తొలగింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో పొట్టిశ్రీరాములు కూడలి నుంచి అరసవల్లి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న షాపులు, ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా కార్పొరేషన్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, పోలీస్‌శాఖ అధికారులు రెండు, మూడు రోజులుగా సంయుక్తంగా పరిశీలన చేస్తున్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వరరావు, టీపీఓ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి

జి.సిగడాం: పల్లెల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్ రాధిక, ఆర్ఐ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

నందెన్నకు బిందె దీపాల పూజలు



పూజలందుకుంటున్న నందెన్న

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొన్నావీధి భీమేశ్వరాలయంలో నిర్వహిస్తున్న నందెన్న ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మహిళలు బిందెలలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలేశ్వర కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



దీపారాధన చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో నందెన్నకు ప్రత్యేక పూజలు చేశారు.

మురుగునీరు వెళ్లే దారేదీ?

- చాపురం పంచాయతీలో పేరుకుపోతున్న కాలువలు
- దుర్వాసన భరించలేకపోతున్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్:

మండల పరిధిలోని చాపురం పంచాయతీ చాపురం, సిద్ధిపేట గ్రామాల్లో కాలువలు కంపుకొడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన వెలువడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నగరపాలక సంస్థలో విలీనమైనప్పటికీ మున్సిపాలిటీపరంగా చే యాల్సిన శానిటేషన్ పనులు రెండు గ్రామాల్లోనూ అరకొరగానే జరుగుతున్నాయని చెబుతున్నారు.



ఇంటి వద్ద నిలిచిన మురుగునీరు

తెలుగు తమ్ముళ్ల హవా..

పంచాయతీ పరిధిలో తెలుగు తమ్ముళ్ల హవా ఎక్కువైందని, వారు చెప్పినట్లు అధికార యంత్రాంగం వింటోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఏదైనా కార్యక్రమం జరిగితే మిగిలిపోయిన వ్యర్థాలను శానిటేషన్‌కు తరలించాలంటే తెలుగు దేశం నాయకులు అనుమతులు ఉంటేనే చెత్త చెదారం డబ్బాలను నగరపాలక యంత్రాంగం ఏర్పాటు చేస్తోందని, లేదంటే ఇంటి వద్దనే ఉంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి మళ్లించాలి..

చాపురం, సిద్ధిపేట గ్రామాల్లో కాలువలు ఉన్నా మురుగునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. అందుకే ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. మురుగునీటిని జాతీయ రహదారి వెంబడి కాలువలకు మళ్లిస్తే బాగుంటుంది.

– ఎల్.ఈశ్వరరావు, గ్రామస్తుడు

పరిశీలిస్తాం..

చాపురం, సిద్ధిపేట కాలువల్లో నిల్వ ఉండిపోయిన మురికినీటిని శుభ్రం చేయిస్తాం. మురుగునీరు వెళ్లేందుక డ్రైనేజీ కట్టిస్తాం. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడతాం.

– దక్షిణామూర్తి, మున్సిపల్ ఇంజినీర్, శ్రీకాకుళం

నీరుపయోగం



ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సైన్స్, ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రం నిరుపయోగంగా మారింది. ఆర్వో ప్లాంట్ నుంచి ఈ యంత్రం ద్వారా నీరు ఫిల్టర్‌గా మారి చల్లని, వేడి నీరుగా బయటకు వచ్చేది. నిర్వహణ లేక పాడైపోవడంతో మూలకు చేరింది.

– ఎచ్చెర్ల క్యాంపస్

రోడ్డు గోతులమయం



శ్రీకాకుళం నగరంలోని సిద్ధిపేట రోడ్డులో వరంకాలనీ, డెంటల్ కాలనీకి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాది మంది కార్మికులు, వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రారంభానికి మోక్షమెప్పుడో?



శ్రీకాకుళం రూరల్ మండలం చాపురం పంచాయతీ కేంద్రంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో రైతులు వ్యవసాయ సంబంధిత సేవలు పొందలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

పిచ్చిమొక్కలిలా.. సాగునీరెలా?



మడ్డువలస ప్రధాన కుడికాలువ పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండిపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడంలేదు. నాగులవలస నుంచి మెట్టవలస వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– జి.సిగడాం

కార్యకర్తకు పరామర్శ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాజా శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాదరావు, ఎంపీటీసీ ఎ.శ్రీనివాసరావు, పిల్ల ఆనందరావు పాత్రుడు, అల్లంపల్లి నాగరాజు, జాడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ప్రకృతి సేద్యంతో చీడపీడల నివారణ

రణస్థలం: ప్రకృతి వ్యవసాయంలో బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి మిశ్రమ ద్రవాలతో మొక్కజొన్న, వరిలో కాయ, కాండం తొలిచే పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అన్నారు. బంటుపల్లి గ్రామంలో రైతులకు బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం ద్రవాల తయారీపై అవగాహన కల్పించారు. ఆసక్తి గల రైతులు 90009 46694 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కొయ్యాన రాంబాబు, పెద్దింటి రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.



ద్రావణాలను తయారు చేస్తున్న సిబ్బంది

27న బహుమతుల ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న అయ్యప్ప దేవాలయంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ చిన్నారులు ఇటీవల జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని అధిక బహుమతులు దక్కించుకున్నారని క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 రకాల పోటీలకు క్లబ్ తరఫున 165 మంది విద్యార్థులు హాజరై 40 మంది బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. వీరికి ఈ నెల 27న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు

తొమ్మిది పంచాయతీలకు కార్యదర్శుల కొరత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను తొమ్మిది చోట్ల కార్యదర్శులు లేరు. కొత్త కార్యదర్శి బదిలీపై వచ్చాక పాత కార్యదర్శిని బదిలీ చేస్తే సమస్య వచ్చేది కాదని.. పదోన్నతులు, ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో కార్యదర్శుల బదిలీలు చేపట్టడం వల్లే ఈ సమస్య తలెత్తిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలు అమలు, పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు పాలనలో గ్రామ కార్యదర్శులు కీలకం. అయితే మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు కార్యదర్శులు వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. మరోవైపు ఇన్‌చార్జి బాధ్యతలు సైతం స్వీకరించేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ధర్మవరం, ఫరీదుపేట, ఎచ్చెర్ల, చిలకపాలెం, పొన్నాడ, కొత్తపేట, కుప్పిలి, తోటపాలెం, కుశాలపురం గ్రామాల్లో కార్యదర్శులు లేరు.

వ్యాధులపై అప్రమత్తం

జి.సిగడాం: అంటువ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణ సూచించారు. శుక్రవారం వెంకయ్యపేట, సిగడాం, నడిమివలస సచివాలయాలను సందర్శించారు. బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు తులసీప్రసాద్ సాహు, రాజశేఖరం, పద్మావతి పాల్గొన్నారు.